ప్రజలకు చేసిన మేలును చెప్పేందుకే...
‘వై ఏపీ నీడ్స్ జగన్’

● ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం: విప్లవాత్మక పాలనతో నాలుగున్నరేళ్లుగా ప్రతీ ఇంటికి, ప్రతీ పౌరుడికి ప్రత్యక్షంగా, పరోక్షంగా చేకూర్చిన మేలును వివరించేందుకు రూపొందించిన 'వై ఏపీ నీడ్స్ జగన్' (ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..) కార్యక్రమంలో సంక్షేమ పథకాలను, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పట్టణంలోని మేదరవీధి జంక్షన్‌లోని సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలపై బోర్డులను ఏర్పాటు చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏపీ పథకాల ద్వారా ఎంతమంది లబ్ధి పొందారనే వివరాలతో సచివాలయాల వద్ద సంక్షేమ అభివృద్ధి బోర్డులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో జరిగిన ప్రగతి, సాకారమైన మార్పులను తెలియజేయడంతో పాటు గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని వివరించడం జరుగుతుందన్నారు. రోజూ వలంటీర్లు వారి పరిధిలో రోజుకు 15 ఇళ్లు చొప్పున్న సందర్భించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలను గూర్చి లబ్ధిదారుల కుటుంబాలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరీ, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, పట్టణ కన్వీనర్ కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ జి.మాధవరావు, కౌన్సిలర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.


సీతానగరం: అభివృద్ధి, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సంక్షేమ పథకాలను వివరించండి

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్టికను తయారుచేసి ప్రజలకు అర్థమయ్యేలా సచివాలయాల్లో డిస్‌ప్లే చేసి వివరించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెదబోగిలి 1-2 సచివాలయాల్లో ఎంపీడీఓ తయారు చేయించిన అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్టిక బోర్డును(డిస్‌ప్లే) గురువారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, ఎంపీపీ ప్రతినిధి బి.శ్రీరాములునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు బి.చిట్టిరాజు, సర్పంచ్ జే తేరేజమ్మ, ఈఓపీఆర్‌డీ కె.కుమారవర్మ, ఈఓ జె.వెంకటరావు, ఎంపీటీసీలు ఎస్.గౌరీ, బి.కుసుమ, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన పార్టీ పతాకాన్ని ఎమ్మెల్యే అలజంగి జోగారావు గురువారం సాయంత్రం ఆవిష్కరించారు.


పార్వతీపురం: వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

జగన్‌ను మళ్లీ సీఎంగా ఆశీర్వదించండి

సాలూరు: జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని ప్రజాప్రతినిధులు, నాయకులు కోరారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం మున్సిపాలిటీలోని 3వ సచివాలయం, మండలంలోని మామిడిపల్లి గ్రామంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సచివాలయాల్లో ప్రజలకు వివిధ సంక్షేమ పథకాలు అందించిన నగదు, అభివృద్ధి పనులు వివరాలను వివరించారు. మామిడిపల్లిలో వైఎస్సార్ కూడలి వద్ద ప్రజాప్రతినిధులు, నాయకులు వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, సచివాలయ కన్వీనర్ గిరిరఘు, కౌన్సిలర్‌లు, నాయకులు, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, పార్టీ మండలాధ్యక్షుడు సువ్వాడ భరత్‌శ్రీనివాస్, పార్టీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, అధికారులు జయరాం, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంటలో...

పాచిపెంట: పాచిపెంట మండల కేంద్రంలో సచివాలయం -1 పరిధిలో ఆంధ్రాకు మళ్లీ జగనే ఎందుకు కావాలి కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా మరలా ఆశీర్వదించాలని ప్రజాప్రతినిధులు, నాయకులు కోరారు. సచివాలయ పరిధిలో ప్రజలకు వివిధ సంక్షేమ పథకాలు అందించిన నగదు, అభివృద్ధి పనులు వివరాలను వివరించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దోల బాబ్జి, సచివాలయ కన్వీనర్ మజ్జి వెంకటరావు, జేసీఎస్ కన్వీనర్, ఏఓ పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.


సాలూరు: మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం


పాచిపెంటలో నిర్వహిస్తున్న ఆంధ్రాకు మళ్లీ జగనే ఎందుకు కావాలి కార్యక్రమం

బలిజిపేటలో..


బలిజిపేట: సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన నాయకులు

బలిజిపేట: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బలిజిపేట సచివాలయం వద్ద గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రజల జీవనప్రమాణాలు మెరుగుయ్యాయన్నారు. అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో జరుగుతున్నాయన్నారు. సర్పంచ్ బి.రాఘలత, మండల పార్టీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ అప్పలరాజు, ఎంఈఓ సామల సింహాచలం, మండల సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు శ్రీరాములు నాయుడు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, పలగర సహకార సంఘం అధ్యక్షుడు పకీరునాయుడు, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహ స్వామి


సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖీ నది ఒడ్డున వేంచేసిన లక్ష్మీనృసింహ స్వామి భక్తులకు ప్రత్యేక అలంకరణలో గురువారం దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు గురువారం వేకువ జాము నుంచే లక్ష్మీనృసింహ స్వామిని ప్రత్యేక అలంకరణ చేసారు. దూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులచే క్షీరాభిషేకాలు, కుంకుమ పూజలు అర్చకులు చేయించారు.

వేతనాల కోసం వినతి


ఆర్డీఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్ల నాయకులు

పార్వతీపురం: అంగన్‌వాడీల పెండింగ్‌లో వున్న రెండు నెలల వేతనాలను చెల్లించాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావుకు అంగన్‌వాడీ వర్కర్ల నాయకులు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకాలంలో వేతనాలు అందకపోవడం వల్ల కుటుంబ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీపావళి తదితర పండగలు రావడంతో ఆర్థిక ఇబ్బందులు మరింతగా పెరిగాయన్నారు. ఈ విషయాన్ని ఐసీడీఎస్ పీడీతో చర్చించి కారణాలు తెలుసుకొని వేతనాలు వచ్చేలా చర్యలు చేపడతామని జేసీ తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో ఎం.ఉమామహేశ్వరీ, జి.జ్యోతి తదితరులున్నారు.

మంచి విద్యతోనే భవిష్యత్


పాఠశాలలో విద్యార్థులను ప్రశ్నిస్తున్న ఎంఈఓ

బలిజిపేట: మంచి విద్యే విద్యార్థుల భవిష్యత్ అని ఎంఈఓ-1సామల సింహాచలం అన్నారు. బలిజిపేట ప్రాథమిక పాఠశాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం తరగతి గదులను పర్యవేక్షించి విద్యార్థుల నైపుణ్యాలను పరీక్షించారు. బోర్డుపై రాసి ఉన్న పదాలను చదివించి వారికి తగు సూచనలు చేయడం జరిగింది. విద్యార్థులకు మంచి విద్యను అందించడం వల్ల వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దిన వారమవుతామని ఉపాధ్యాయులకు సూచించారు. మెనూ ప్రకారం వంటలు వండింది లేనిది పరిశీలించారు. వంటలను రుచి చూసి సంతృప్తి చెందారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏటీఎం మోడల్‌లో అంతర పంటల సాగుపై అవగాహన


మిర్తివలసలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బలిజిపేట: మండలంలోని మిర్తివలస గ్రామంలో ఏటీఎం మోడల్‌లో అంతర్ పంటలను పండించడంపై ప్రకృతి వ్యవసాయ రీజనల్ అధికారి ప్రకాష్ రైతులకు గురువారం అవగాహన కల్పించారు. వి.సన్యాసినాయుడు పొలంలో ఏటీఎం మోడల్ విధానంలో అంతర్ పంటలను ఏ విధంగా పండించాలో వివరించారు. అందులో భాగంగా బయో ఇన్‌పుట్ సెంటరులో 2000 లీటర్ల ద్రవ జీవామృతం తయారు చేయడం, 600లీటర్ల పలు పత్ర ద్రావణాన్ని మామిడి తోటలకు స్ప్రేయింగ్ చేయడం జరిగింది. ప్రకృతి వ్యవసాయం చేయడం వలన రైతులకు మంచి దిగుబడులు వచ్చి ఖర్చు తక్కువగా ఉంటుందన్నారు. నాణ్యమైన పంటలు అందుబాటులోకి వస్తాయని అధికారి ప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో ఏఓ శ్రావణ్‌కుమార్, ఎంసీఆర్‌పీ లక్ష్మి, వీఏఏ ప్రశాంతి, ఐసీఆర్‌పీ తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే బాల్య వివాహాల కట్టడి


మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి

సీతానగరం: అందరి సహకారంతోనే బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయొచ్చని ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో రెడ్ అలర్ట్ మై ఛాయిస్ ఫౌండేషన్ సీఈఓ జి.పద్మ ఆధ్వర్యంలో బాల్య వివాహాలను నిర్మూలిద్దాం అంశంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ బాల్య వివాహాలు అనర్థాలకు దారితీస్తుందని పేర్కొన్నారు. దీన్ని పిల్లల తల్లిదండ్రులు గుర్తించాలని సూచించారు. సంస్థ సీఈఓ పద్మ మాట్లాడుతూ గ్రామాల్లో కొందరిని ఎంపిక చేసి వారిని రక్ష కమ్యూనిటీ లీడర్ అని చెప్పి గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఏఎస్‌ఐ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ లైంగికపరమైన దాడులు, అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాల కార్మికులచే పని చేయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, ఐసీడీఎస్ సీడీపీఓ సుగుణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టీకాల లక్ష్యాలు పూర్తి చేయాలి : డీఐఓ


వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఐఓ జగన్‌మోహన్‌రావు

పార్వతీపురం టౌన్: ప్రతీ చిన్నారికి టీకా పూర్తి చేయడమే లక్ష్యంగా వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ)డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. పట్టణ శివార్లలో నవిరికాలనీ వద్ద తాత్కాలిక జీవనం సాగిస్తున్న వలస కార్మికులు ఉండే ప్రాంతాన్ని వైద్య సిబ్బందితో గురువారం సందర్శించి అక్కడ పిల్లలకు, గర్భిణులకు టీకాలు ఏ మేరకు వేశారో తనిఖీ చేశారు. పిల్లల తల్లిదండ్రులతో ఆయన మాట్లాడి, పిల్లల వయస్సు బట్టి టీకా ఏ మేరకు పూర్తయ్యిందీ, అదే విధంగా ఈ మధ్య కాలంలో వచ్చిన నివాసితులు, వారిలో ఐదేళ్లలోపు పిల్లలు, గర్భిణులు ఎవరైనా ఉన్నారా అని ఆరా తీశారు. పిల్లల టీకా వివరాలు రికార్డులో నమోదు చేసి గడువు తేదీలకు అనుగుణంగా అక్కడ పిల్లలకు టీకా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అవసరమైన మందులు వారికి అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది శాంతికుమారి, శ్రావణి సంధ్య, ఆశా కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లల పంపిణీ వేగవంతం


వద్దంగిగూడ చెరువులో చేపపిల్లలు విడిచి పెడుతున్న పీఓ కల్పనాకుమారి, తదితరులు

భామిని: జిల్లాలోని గిరిజనులకు ఐదు రోజుల్లో చేప పిల్లల పంపిణీ పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ పి.కల్పనాకుమారి అన్నారు. మండలంలోని వద్దంగిగూడ చెరువులో సర్పంచ్ కొండగొర్రి ఉషారాణితో కలిసి పీఓ కల్పనాకుమారి గురువారం చేప పిల్లలను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ సీజన్‌లో వేగవంతంగా మత్స్య సంపద చేతికి అందేలా చూడాలన్నారు. ఐటీడీఏ ద్వారా జిల్లాలోని 454 చెరువుల్లో 12,98, 500 చేప పిల్లలను విడిచిపెట్టనున్నట్లు డివిజనల్ ఫిషరీస్ అధికారి జి. గోపీకృష్ణ తెలిపారు. కట్ల, రోహూ, ఎర్ర మిగల, తదితర రకాల చేపలను చెరువుల్లో నీటివ

మత్స్య సంపదతో ఆర్థికంగా ఎదగాలి...

సీతంపేట: మత్స్య సంపదతో ఆర్థికంగా ఎదగాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కల్పనాకుమారి అన్నారు. మండలంలోని పులిపుట్టి పంచాయతీ పరిధిలో చెరువుల్లో 36 వేల చేప పిల్లలను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చేపల పెంపకంతో గిరిజనులు అభివృద్ధి చెందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డబ్బీరు గోపీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. పట్టాలు తగ్గక ముందే వేయాలని సూచించారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న బొబ్బిలి కోర్టు సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్

సీతానగరం: విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరమని బొబ్బిలి కోర్టు సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్ అన్నారు. గిరిజన ప్రతిభా విద్యాలయంలో ప్రిన్సిపాల్ పోల వెంకటినాయుడు అధ్యక్షతన లీగల్ సర్వీసెస్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ మేరకు సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్ మాట్లాడుతూ చట్టాలపై అవగాహన లేకే విద్యార్థులు, ప్రజలు కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. బొబ్బిలి కోర్టు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.సరోజనమ్మ మాట్లాడుతూ చట్టం దృష్టిలో అందరూ సమానులేనన్నారు. చట్టానికి లోబడి విధులు నిర్వహించాలన్నారు. విద్యార్థులు క్షణికావేశంలో తప్పులు చేయడం వల్ల ఇబ్బందులు వస్తాయన్నారు. ఎస్‌ఐ కె.నీలకంఠం మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి సమాజానిక సేవలందించాలన్నారు.

సక్రమంగా ఓటర్ల జాబితాలు

పాలకొండ: ఓటర్ల జాబితాలు సక్రమంగా సిద్ధం చేయాలని తహసీల్దార్ పి. సోమేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో బీఎల్‌ఓలతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఓటరు లిస్టులో ఉన్న ఫొటోలు సక్రమంగా లేకపోతే వాటి స్థానంలో కొత్త ఫొటోను జత చేయాలని సూచించారు. డబల్ ఎంట్రీలు ఉంటే తొలగించాలన్నారు. ఆయనతో పాటు టీడీ బుచ్చయ్య ఉన్నారు.

జాబ్‌మేళాలో 18 మంది ఎంపిక

సీతంపేట: స్థానిక వైటీసీలో గురువారం జరిగిన జాబ్‌మేళాలో 18 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మోండెలెజ్ ఇండియా ఫుడ్స్ చాక్లెట్ కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన ఈ జాబ్‌మేళాకు 55 మంది హాజరయ్యారు. అర్హతలు, నైపుణ్యాల ప్రకారం 18 మందిని ఎంపిక చేసినట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో వైటీసీ మేనేజర్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

మండల, గ్రామ సచివాలయ కమిటీలకు అవగాహన


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ రాణి

పాచిపెంట: రక్తహీనత గల గర్భిణులు, పాలిచ్చు తల్లులు, కౌమార బాలికలు, బరువు తక్కువ పిల్లలు, స్టైంటింగ్ గ్రోత్ పిల్లలు పరిస్థితులను మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకునేందుకు మక్కువ మండలంలో ఇటీవల నియమించిన మండల, గ్రామ స్థాయి కమిటీలకు మక్కువ మండల పరిషత్ కార్యాలయంలో పార్వతీపురం ఐసీడీఎస్ పీడీ ఎం.ఎస్.రాణి అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా వీటికి సంబంధించి పూర్తి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కమిటీ సభ్యులు అందరూ కూడా సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ సూర్యనారాయణ, సీడీపీఓ బొత్స అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో శతతాతం ఫలితాలు సాధించాలి : పీఓ


విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

పాచిపెంట: రానున్న పదవ తరగతి పరీక్షల్లో శతశాతం ఫలితాలు సాధించాలని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ అన్నారు. మక్కువ మండలం ఎర్రసామంతులవలస ఆశ్రమ పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. పాఠశాల పరిసరాలను, ఆహార పదార్థాలను ఆయన తనిఖీ చేశారు. పారిశుద్ధ్యం పక్కాగా ఉండాలన్నారు. విద్యా బోధనలో లోపాలు ఉండరాదన్నారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించాలని, అందుకు ఇప్పటి నుంచే సరైన ప్రణాళికతో ఇష్టపడి చదవాలని సూచించారు. సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం ఎర్రసామంతులవలస, అనసభద్ర ఏకలవ్య మోడల్ పాఠశాలలో చేపడుతున్న పనులను పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట గిరిజన సంక్షేమ శాఖ కార్య నిర్వాహక ఇంజినీర్ జె.శాంతీశ్వరరావు తదితరులు ఉన్నారు.

వాహనాలు జీపీఎస్ ఏర్పాటు చేసుకోవాలి


మాట్లాడుతున్న వరప్రసాద్

బలిజిపేట: ధాన్యం కొనుగోలు సమయంలో మిల్లులకు ధాన్యం తరలించే వాహనాలకు కచ్చితంగా జీపీఎస్ పరికరాన్ని ఏర్పాటు చేసుకోవాలని అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎ.వరప్రసాద్ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన గురువారం మాట్లాడారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో ఆర్‌బీకేల ద్వారా మిల్లులకు ధాన్యం తరలించేందుకు వాహనాలను ఇచ్చేవారు ముందుగా జీపీఎస్ ఏర్పాటు చేసుకుంటేనే వాహనం రిజిస్ట్రేషన్ చేయబడుతుందన్నారు. రూ.2,600 చెల్లించి జీపీఎస్ చేయించుకోవాలన్నారు. బలిజిపేట మండలానికి సంబంధించి వై.సంగీత్‌కుమార్ 7981454324 నంబరును సంప్రదించాలన్నారు. దీనివలన వాహనదారుకు, రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురుకావన్నారు. ఆయనతో పాటు తహసీల్దార్ అప్పలరాజు, ఏఓ శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

డిప్యూటీ సీఎంకు కాంట్రాక్టర్ల ఫిర్యాదు


ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరకు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టర్లు, ట్రాక్టర్ల యజమానులు

సాలూరు: క్వారీల వద్ద ఏర్పాటు చేసిన రాఘవేంద్ర కన్‌స్ట్రక్షన్స్ సిబ్బంది తీరు వల్ల అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతుందని పలువురు కాంట్రాక్టర్లు, ట్రాక్టర్ యజమానులు ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పట్టణంలో ఆయన గృహంలో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. సొంత పొలాల నుంచి మట్టిని తీసి ఇళ్ల నిర్మాణాలకు తీసుకువెళ్తున్నా.. భూములు చదును చేసేందుకు మట్టి తీసుకువెళ్తున్నా, నూతనంగా ఏర్పాటు చేసిన టోల్‌గేట్ల వద్ద సదరు సిబ్బంది ఇబ్బందులు పెడుతూ అపరాధ రుసుం వేస్తున్నారని ఆరోపించారు. మట్టిని తరలిస్తే గ్రావెల్ తరలించినట్టు ఫైన్‌లు వేస్తున్నారని తెలిపారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులు, గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనుల నిమిత్తం మెటీరియల్ కోసం క్వారీలకు వెళ్తుంటే సకాలంలో కూపన్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. దీంతో అభివృద్ధి పనుల్లో జాప్యం చోటు చేసుకుంటుందన్నారు.

దీనిపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర మాట్లాడుతూ కొద్ది రోజుల నుంచి ఇటువంటి ఫిర్యాదులు వస్తున్నాయని, అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తే సహించేది లేదని చెప్పారు. విజయనగరం, పార్వతీపురం జిల్లాల కలెక్టర్లు స్పందించి దీనిపై ప్రత్యేక పర్యవేక్షణకు ఏడీ మైన్స్ ఆధ్వర్యంలో డీపీఓ, డ్వామా పీడీ, పీఆర్, ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్, స్థానిక మండల ఇంజినీరింగ్ అధికారులతో బృందాన్ని వేయాలని అన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పార్వతీపురం / సాలూరు
9010204441, 9951602891
Office mail : vzmadvt@gmail.com